ఇంకా పెళ్లి కావలసిన చెల్లెళ్లు ఇద్దరున్నారు కదా. నువ్విలా లేనిపోని ఆలోచనలు చేయకు. కాస్త జానకిని కనిపెట్టుకొని వుండు" అని శ్రీధర్ ఇంట్లోకి వెళ్ళి "పాపతో కాస్త హోమ్‌వర్క్ చేయించమంది మీ వదిన. తనకి ఇంకా పని తెమల్లేదంట" అన్నాడు జానకితో.

ఎప్పుడూ పాపతో హోమ్‌వర్క్ విజయే చేయిస్తుంది. ఇవాళ కొత్తగా శ్రీధర్ అలా చెపుతూంటే జానకికి కాస్త ఆశ్చర్యం వేసింది.

"వదిన చెప్పిందా" అడిగింది.

"ఆ"

"అదేంటి ఇందాకే పాపతో హోమ్‌వర్క్ చేయించింది కదా" అంది జానకి.

శ్రీధర్‌కి చిర్రెత్తుకొచ్చింది.

"ఏమో నాకేం తెలుసు. పోయి ఆవిడనే అడుగు" అన్నాడు.

జానకి తప్పనిసరిగా బోర్డ్ ముందు నుంచి లేవాల్సి వచ్చింది. వంటింటి గుమ్మం దగ్గర నిలబడి "ఏమైనా పనుందా వదినా" అడిగింది.

మినపపిండిలో రవ్వ కలుపుతున్న విజయ తల తిప్పి చూసి "ఏం లేదు. ఎవరు గెలిచారు" నవ్వుతూ అడిగింది.

జానకికి అన్నయ్య తనని కావాలనే అక్కడ నుంచి పంపించివేశాడని అర్థం అయింది. తిరిగి హాల్లోకి వెళ్ళి ఆడే ధైర్యం చేయలేకపోయింది.

భోజనాలు చేసి అంతా పడుకున్నారు. పక్కమీదైతే వాలింది కాని జానకీకి నిద్ర రావటం లేదు.

మగవాళ్ళతో కాస్త చనువుగా మాట్లాడటం అన్నయ్య భరించలేడు. ఇంతకు ముందు అన్నయ్య స్నేహితులు ఎవరైనా వచ్చినప్పుడు, వాళ్ళతో మాట్లాడుతున్నప్పుడు కూడా ఇలాగే పంపించేశాడు. ఏమనుకుంటున్నాడు. ఎప్పుడు కాపలా కాస్తున్నట్టే వుంటాడు. ఇంతేనా జీవితమంతా? చదువు, ఉద్యోగం, సంపాదన-ఇంతేనా బతుకంటే. కాదు. వీటన్నిటి నుంచి భౌతిక జీవితం సుఖంగానే సాగుతోంది. కాని మనసులోని ఆనంద విషాదాలకి, అనుభూతి నిండిన అనుభవాలకీ హేతువు ఏదో వుంటుంది కదా. అదే కావలసింది. ఇంట్లోవాళ్ళు చేసిన పెళ్లి, తప్పనిసరి పరిస్థితిలో చదివించిన చదువు, దొరికింది కదాని చేయిస్తున్న వుద్యోగం- ఏదీ తనలోని ఇష్టాలకి

